

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 71 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'దుర్మార్గుడా! ఇంతటితో నీ కథ ముగిసింది' అంటూ కత్తిని విసిరింది యువరాణి. మెరుపులా పక్కకు వంగి తప్పుకున్నాడు మంత్రాల మారయ్య. యువరాణి రెండు చేతులనూ వడిసి పట్టుకున్నాడు. యువరాణి చేతిలో కత్తి కిందపడిపోయింది. తప్పించుకోడానికి పెనుగులాడింది యువరాణి.

'హహహ' అని వికటంగా నవ్వి 'ఇక తప్పించుకోలేవు లలితమ్మగోరూ' అని నాలుక కరుచుకుని నెత్తిమీద చరుచుకున్నాడు మంత్రాల మారిగాడుగా నటిస్తున్న జాంబడు. ఒక్క ఉదుటున యువరాణిని భుజం మీదకు ఎత్తుకున్నాడు. 'ఇక నా మంత్రాల ద్వీపంలో నిన్ను బలిస్తాను' అంటూ వడిగా అడుగులేశాడు.

కోపంగా జాంబడి నెత్తిమీద చరిచింది చిన్నారి లలిత. 'అరేయ్! నేను యువరాణినిరా తిక్కలోడా' అని అరిచింది. 'తప్పైపోయింది యువరాణిగోరూ! అయినా యువరాణిగోరి పేరు కూడా లలితమ్మ గోరు అనుకుందాంలే' అని పరుగెత్తబోయాడు మంత్రాల మారిగాడు.

మామిడిచెట్టు కొమ్మల్లోనుండి హఠాత్తుగా కిందికి దూకాదు ఉజ్జయిని యువరాజు. 'భయపడకు యువరాణీ! ఈ మంత్రాల మారిగాడిని  విడిపించి నీ భరతం పడతాను' అంటూ కత్తిని ఝళిపించాడు ఉజ్జయిని యువరాజు. కిసుక్కున నవ్వి యువరాణిని నేలమీద పడేశాడు మంత్రాల మారిగాడు. నేల మీద ఎత్తి పడేసినందుకు బాధ పడలేదు యువరాణి. నడుము కలుక్కుమని నొప్పి పెట్టిన సంగతీ పట్టించుకోలేదు. కోపంగా అసహనంగా నుదురు బాదుకున్నది.

'నీ మొహం! నన్ను విడిపించి ఈ మంత్రాల మారిగాడి భారతం పట్టాలిరా!' కోపంగా అరిచింది ఉజ్జయిని యువరాజును. పొట్ట ఎగిరి పడేట్టు నవ్వుతూ కింద కూలబడ్డాడు మంత్రాల మారిగాడు. 'పొరపాటు అయ్యింది' అన్నట్టు చేయి ఊపుతూ తానూ కూలబడ్డాడు ఉజ్జయిని యువరాజు ఇర్మిన్. అప్పటిదాకా బిగబట్టుకున్న నవ్వు అలలు అలలుగా చెలరేగుతుండగా తానూ కూలబడింది యువరాణి.

ముసురుపట్టినట్టుగా ఉన్నది వాతావరణం. ఉదయం నుండీ ఉండీ ఉండీ తుంపర పడుతున్నది. దట్టంగా మబ్బులు కమ్ముకుని జల్లులతో అంతలోనే తేలిపోతున్నాయి. సూర్యుడు నడి నెత్తిన ఉన్నా మబ్బులు చిక్కగా కమ్ముకోవడంతో పట్టపగలే చీకట్లు ముసురుకుంటున్నాయి.

'జెనూహ్ (ఇక చాలు) ఇర్మిన్! 'కొమ్ నార్ హాయిస్' (ఇంట్లోకి వచ్చేయండి) అంటూ మిద్దె మీదినుండి లేడీ హాలె గొంతు శరత్కాలంలో కోయిల గొంతులాగా మామిడి చెట్లమధ్య ప్రతిధ్వనించింది. లోపల విశాలమైన గదిలో మగతగా పక్కమీద పడి ఉన్న అంబ్రాస్ ఆ ధ్వనికి కొద్దిగా కనులు తెరిచి మళ్ళీ మత్తులోకి జారుకున్నాడు. ఒళ్లంతా కట్లతో కూలిపోయిన బూరుగు చెట్టులా ఉన్నాడు.

పానుపుకు రెండుపక్కలా కూర్చున్న వైద్యులు సంతృప్తిగా ముఖాలు చూసుకున్నారు. అల్లంత దూరంలో మెత్తని బాలీసుల మధ్యన కూరుకుపోయినట్లు కూర్చుని ఉన్నాడు దామోదర శర్మ. మౌనంగా అంతా గమనిస్తూ కూర్చున్నాడు.

అప్పుడే తన మాధ్యాహ్నిక అనుష్ఠానం పూర్తి చేసుకుని వచ్చిన ప్రశాంతత వెనుక ఏదో కలవరం చెలరేగుతున్నది దామోదరశర్మ అంతరంగంలో.

ఆ ఉదయం సూర్యోదయ సమయానికి ప్రాణాలతో ఉన్నదీ లేనిదీ తెలియని స్థితిలో ఉన్న అంబ్రాస్, ఒంటిమీద అక్కడక్కడ గాయాలతో నీరసించి ఉన్న కృష్ణరాయలు నాగులవంచ నుండి చేరుకున్నారు. కృష్ణరాయల అంగరక్షకులు అందరూ కూలడానికి సిద్ధంగా ఉన్న కులపర్వత శిఖరాలలాగా ఉన్నారు. గాయాలతో నిలువునా పూచిన తంగేడు చెట్లలా ఉన్నారు.

అపర ధన్వంతరి అని పేరు మోసిన కృష్ణరాయల అంతఃపుర వైద్యుడు తన శిష్యుల సహాయంతో చికిత్స ప్రారంభించాడు. ఆవిరి స్నానాలు, మూలికల కట్లు, కషాయాలతో నాలుగు ఘడియలలో తేరుకున్నారు కృష్ణరాయలు, ఆయన అంగ రక్షకులు. మధ్యాహ్న సమయానికి కానీ కనులు తెరవలేదు అంబ్రాస్. క్రమ క్రమంగా అంబ్రాస్ ముఖం తేట పడడంతో తేలికగా ఊపిరి పీల్చుకున్నారు వైద్యులు.

ఆ రోజు దుర్గాష్టమి. సాయంత్రం పందిరిలో విశేషమైన బాలా పూజ ఉన్నది. ఉదయకాలపు పూజ, ధ్యానం ముగించుకుని పండ్లు, పాలు తీసుకున్నాడు కృష్ణరాయలు. అంగరక్షకులను పరామర్శించి, విశ్రాంతి తీసుకొమ్మని చెప్పి అమ్మవారి పందిరి వైపు వెళ్లి అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించాడు. నాగులవంచ వార్తలు తెలిసి స్తంభాద్రినుండి గోల్కొండ ప్రభువుల ప్రతినిధులు వచ్చి పరామర్శించారు. దీర్ఘంగా చర్చలు చేశారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. కృష్ణరాయలను సమగ్రమైన నివేదికను గోల్కొండ ప్రభువులకు పంపవలసిందిగా అడిగి, అభినందించి వెళ్ళారు.

కృష్ణరాయల మనసంతా అల్లకల్లోలంగా ఉన్నది. నవరాత్రి దీక్షలో ఉండి పొలిమేరలు దాటడం మొదటిసారి. చేజేతులా ప్రాణ హింసకు పాల్పడవలసి వచ్చింది పవిత్రమైన దీక్షా సమయంలో. సజ్జనుడైన అంబ్రాస్ ప్రాణ రక్షణకోసం, స్నేహ ధర్మంగా, గోల్కొండ ప్రభువుల అధికార ప్రతినిధిగా విధ్యుక్త ధర్మ నిర్వహణ కోసమే కదా వెళ్ళింది అని అంతరాత్మకు నచ్చ చెప్పుకోడానికి ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. కానీ సంతృప్తి కలగడం లేదు. పూజ గదిలో జింక చర్మం పరుచుకుని మౌనంగా విశ్రమించాడు. ఆలోచనలతో అల్లకల్లోలమౌతున్న మనసును సమాధాన పరచడానికి ప్రయత్నం కొనసాగించాడు.

ఆటలు చాలు, ఇంట్లోకి రమ్మని కొడుకును పదే పదే పిల్చి అలిసిపోయింది లేడీ హాలె. లొపలికి వచ్చి భర్త పానుపు పక్కన కూర్చున్నది. పరిచారికలను పిల్లలకోసం తోటలోకి పంప వలసిందిగా దామోదర శర్మకు గుర్తు చేసింది మరొకమారు.

'గోల్కొండ ప్రభువుల ప్రతినిధిగా, పాలకుడిగా ఉండీ సామాన్యులతో అంతగా కలిసిపోవడం ఆశ్చర్యంగా ఉన్నది' అన్నది లేడీ హాలె దామోదర శర్మతో. సంభాషణ అంతా డచ్చిలో నడుస్తున్నది.

'అది సమర్థుడైన నాయకుడి సహజ లక్షణం' అన్నాడు దామోదరశర్మ.

'భారతీయుల సామాజిక వ్యవస్థలో బ్రాహ్మణులంటే చాలా ఉన్నతులు అని కదా! తన కూతురు విదేశీయుల పిల్లడితో, చివరికి కాటి కాపరి కొడుకుతో కూడా అలా స్వేచ్ఛగా ఆడుకుంటుంటే అభ్యంతరం చెప్పకపోవడం వింతగా ఉన్నది' అన్నది.

'కులము, అంతస్తు, అధికారము మనుషులను విడదీయడానికి కాదు అని కృష్ణరాయల విశ్వాసం. పిల్లలు దైవస్వరూపులు అని ఆయన నమ్ముతాడు. అన్నిటికీ మించి చిన్నారి లలిత ఆయన ప్రాణం. ఆ చిట్టితల్లిని చిన్నబుచ్చడం ఎట్టి పరిస్థితిలోనూ చేయడు కృష్ణరాయలు' అన్నాడు దామోదరశర్మ.

కొంతసేపు మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయింది లేడీ హాలె. 'మామిడి తోటలో రాముడి మందిరం! దుర్గా నవరాత్రులు, అమ్మవారి అర్చన! పూజామందిరంలో నిత్యమూ మహాబలి ఉపాసన! కృష్ణరాయలను అర్థం చేసుకోలేకపోతున్నాను' అన్నది.

'హనుమ శివ కేశవ సమిష్టి స్వరూపం. సీతాదేవి దుర్గా స్వరూపిణి. కనుకనే సాధనా మార్గంలో అత్యున్నత స్థాయికి చేరుకున్న కృష్ణరాయలకు ఎక్కడా, ఎందులోనూ, ఎవరిలోనూ ఏ భేదమూ కనిపించదు. షట్చక్ర భేదనం తెలిసిన మహాయోగి కృష్ణరాయలు. అంతా ఆయన గురుదేవుడు సమర్థ రాముడి అనుగ్రహం' అన్నాడు దామోదరశర్మ.

పిల్లలకోసం తోటలోకి వెళ్ళిన పరిచారిక వచ్చి పిల్లలు మున్నేటి మధ్యలో ఉన్న జీడికంటి రాముడి దర్శనానికి వెళ్ళారని చెప్పింది. ఆ మాట వినడంతోటే దిగ్గున లేచాడు దామోదరశర్మ. చేతికర్రను అందుకున్నాడు. భుజాలమీదుగా

ఉత్తరీయాన్ని బలంగా చుట్టుకున్నాడు. మహలు రక్షకులను పిలుస్తూ వడిగా అడుగులు వేస్తూ మిద్దె దిగాడు. ఇద్దరు రక్షకులను వెంట తీసుకుని వడిగా మున్నేటి వైపు పరుగు తీసినట్లుగా అడుగులేశాడు.

భద్రాద్రి రాముడు కృష్ణరాయలను కరుణించి ముక్తివరం వేంచేసే సమయంలో మున్నేటి మధ్యలో ఉన్న పెద్ద గండశిలపై పాదాలు మోపాడట. దానికి నిదర్శనంగా ఆ శిలపై రాములవారి పాదాల గుర్తులు కనిపిస్తాయి. ఆ పాదాలకు ప్రతి ఉదయమూ పూజలు చేస్తారు ముక్తివరం పూజారులు.

మామూలుగానే మున్నేటి ప్రవాహం మధ్యలో, చేరుకోడానికి కష్టంగా ఉంటాయి ఆ పాదాలు. గత రెండు రోజులుగా మహారాష్ట్ర, మధ్యభారతంలో పై ఎత్తున కురిసిన వర్షాల వలన మున్నేటికి వరద నీరు చేరి ప్రమాదకరంగా ఉన్నది అని ఆ ఉదయం గ్రామస్తులు అంటుంటే విన్నాడు దామోదరశర్మ.

అలాంటి పరిస్థితులలో స్థంభాద్రి రేవునుండి పడవ వేయడం కూడా మామూలే. ఒకోసారి కనుమూసి తెరిచేలోపు క్షణాలలో ఉప్పెనలాగా పెద్ద ఎత్తున వరద వచ్చి అంతలోనే చల్లబడుతుంది. ఆ తాకిడికి పడవ కొట్టుకుపోయి, మున్నేటి పొడవునా ఉన్న గండ శిలలకు కొట్టుకుని ముక్కలు ముక్కలై ప్రాణ నష్టం జరగడం కూడా సాధారణ విషయమే.

పడవ వేయకుంటే ఆ సాయంత్రం నవరాత్రి పూజకు స్తంభాద్రినుండి వచ్చే అర్చకులు చుట్టూ తిరిగి రావలసిందే అనడమూ విన్నాడు. అమాయకంగా వెళ్లి, మున్నేటి ప్రవాహంలో పిల్లలు ఇబ్బంది పడతారనే భయంతో మహలు రక్షకులను వెంటబెట్టుకుని మున్నేటి ఒడ్డుకు పరుగులు పెట్టాడు దామోదరశర్మ.

★★★★★★★★★★★★★★★

రాములవారి పాదాలున్న గండశిల శిఖరం మాత్రమే కనిపిస్తున్నది. రెండు దరులూ పూసి పారుతున్నది మున్నేరు. రెండు మూడు నిలువుల ఎత్తున కనిపించే బండరాళ్లన్నీ కనిపించకుండా పోయాయి వరదలో.

'హమ్మో! ఎంత వరదో! ఇప్పుడెలా? పాదాల దగ్గరకు వెళ్లలేం! వెనక్కు తిరిగి వెళ్దామా?' కొద్దిగా భయంగా కనులు పెద్దగా చేసి చూస్తూ అడిగింది చిన్నారి లలిత. ఒడ్డున ఇటువైపు ఉన్న బండలు, ఈత చెట్లు, పొదల మధ్య నుండి సుపరిచితమైన గొంతు వెక్కిరింతగా వినిపించింది.

'అంజి గాడి గొంతు!' ఆశ్చర్యంగా అన్నది లలిత, చుట్టూ కలయచూస్తూ.

'హహహ! పిరికి సన్నాసుల్లారా! వెనక్కు పారిపోతారా? నా పడవలో ఎక్కి రాములోరి పాదాల దగ్గరకు పోతారా?' అని అడుగుతూ ప్రత్యక్షమైనాడు వడ్లబత్తుడి కొడుకు నాగాంజనేయాచారి. మాట పూర్తి చేస్తూనే బండల మాటున మాయమైనాడు. బండలు, చెట్ల మాటున ఉంచిన చిన్న పడవను పెద్దగా అరుస్తూ, నీళ్ళలోకి నెట్టి, పడవ లోపలికి దూకాడు. లాఘవంగా తెడ్లు వేస్తూ పడవను ఒడ్డునున్న పిల్లల ముందుకు తీసుకొచ్చాడు.

ఉత్సాహంతో గోలగా కేరింతలు కొడుతూ మోకాళ్ళ లోటు నీళ్ళలోకి దిగి,పడవలోకి దూకారు పిల్లలు ముగ్గురు.

ప్రవాహపు వేగాన్ని తట్టుకుంటూ, ఊయలలు ఊగుతున్నపడవను ముందుకు కదిలించాడు. ఒడ్డునుండి పిలుస్తున్న గొంతులు లీలగా వినిపించి వెనుకకు చూశారు పడవలో పిల్లలు.

ఆందోళనగా పిలుస్తూ పరుగెత్తి వస్తున్న దామోదరశర్మ, మహలు రక్షక భటులు కనిపించారు. ఏదో చెప్పడానికి

నోరు తెరిచిన ఇర్మిన్ ప్రవాహం పై ఎత్తున వేలితో చూపిస్తూ, కళ్ళు పెద్దవి చేసి భయంతో పెద్దగా 'ఓవర్ స్ట్రోమింగ్.. ఓవర్ స్ట్రోమింగ్..' అని అరిచాడు. జాంబదు ఇర్మిన్ చూపించిన వైపు చూస్తూ 'ఉప్పెన..ఉప్పెన..' అంటూ భయంతో వణికిపోతూ అరిచాడు. నీళ్ళలోకి దూకబోతున్న దామోదర శర్మను రక్షకభటులు పెనవేసుకుని బలవంతంగా ఆపుజేసి వెనక్కు లాగారు.

తాడి చెట్టు ఎత్తున తెల్లని నురగలు చిమ్ముతూ చిక్కని గోధుమరంగులో వరద ఒక్కసారిగా విరుచుకు పడ్డది. ఆ తాకిడికి ఆ చిన్ని పడవ సుడిగాలిలో ఎండుటాకులా ఆ ఎగిరింది. అలల మీద తెల్లని నురగల మధ్యన నలుగురు చిన్నారుల చిన్ని పడవ విసిరి కొట్టినట్లుగా మాయమైంది.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS